
శనివారం 04.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 33 సంచిక - 347 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00













## ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసిన పి. పద్మలత



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పి. పద్మలత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, విద్యా హక్కులు మరియు భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. జిల్లాలో బాలలపై జరిగే అన్యాయాలను అరికట్టడం, వారికి మెరుగైన అవకాశాలు కల్పించడం కోసం కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలను పి. పద్మలత ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే, గుంటూరు జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం అత్యంత అవసరమని పేర్కొంటూ, ఈ దిశగా తమకు మద్దతు ఇవ్వాలని పి. పద్మలత, ఎమ్మెల్యే గళ్ళా మాధవిని అభ్యర్థించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే గల్లా మాధవి బాలల హక్కుల పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొంటూ, జిల్లాలో బాలల సంక్షేమం కోసం అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాలల భవిష్యత్తు బలపడాలంటే వారి హక్కులను కాపాడటం ఎంతో ముఖ్యమని, ఈ దిశగా ప్రభుత్వం, కమిషన్, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఇరువురు అభిప్రాయపడ్డారు.

## కొమ్మూరు యువతి జడ్జి గా ఎంపిక



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):**కాకుమాను మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన షేక్ రేష్మ ఆంధ్రప్రదేశ్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఆమె సాధించిన ఈ ఘన విజయం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులకు గర్వకారణంగా నిలిచింది.

**తొలి ప్రయత్నంలోనే విజయం :** రేష్మ 2024లో ఎల్ ఎల్ బి పూర్తి చేసి, 2025 లో జరిగిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు హాజరయ్యారు. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం విశేషం. ఆమె కృషి, పట్టుదల, లక్ష్యసాధన పట్ల నిబద్ధత ఈ విజయానికి మూల కారణం.

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, న్యాయవాదులు, స్నేహితులు మరియు గ్రామస్థులు ఫోన్ ద్వారా, సోషల్ మీడియా వేదికగా ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. పల్లెటూరు నుంచి ఇంతటి ఉన్నత స్థానాన్ని సాధించడం విశేషమని వారు అభిప్రాయపడ్డారు.

ఆమె కృషి, పట్టుదల యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి న్యాయం చేయాలని ఆకాంక్షించారు. గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన ఆమెకు అందరూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## అహికోడ్‌లో బీజేపీ జోష్... ప్రతి కుటుంబానికి చేరువవుతున్న బీజేపీ ప్రచారం





**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్):** కేరళం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకుడు అన్నామలై రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో కన్నూర్ జిల్లా అహికోడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించిన 'కుటుంబ సంగమం' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన అన్నామలైకు అహికోడ్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి తాడువాయి రామకృష్ణ, బీజేపీ అభ్యర్థి కె.కె. వినోద్ కుమార్ సాదర స్వాగతం పలికారు.

అనంతరం జరిగిన కుటుంబ సంగమంలో అన్నామలై మాట్లాడుతూ, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. అహికోడ్ అభ్యర్థి కె.కె. వినోద్ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అహికోడ్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి తాడువాయి రామకృష్ణ మాట్లాడుతూ, నియోజకవర్గంలో బీజేపీకి ప్రజాభిమానంలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తున్నదన్నారు. ప్రతి కుటుంబాన్ని కలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి బలమైన వ్యవస్థను నిర్మించామని, కార్యకర్తల సమన్వయంతో ఈసారి అహికోడ్‌లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తున్నామని, కుటుంబ సంగమం వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల వరకు ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### పరువు పేరిట బిడ్డను బలి చేసిన తండ్రి..!

# మానవత్వమా నీవెక్కడ..?

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పల్నాడు జిల్లా మాచర్లలో గత మార్చి 18న జరిగిన యువతి చౌడేశ్వరి (22) అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. కన్న తండ్రి చంద్రశీను తన కుమార్తెను ప్రేమ వివాహం చేసుకుందన్న కోపంతో హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని పోలీసు విచారణలో బయటపడింది. ఈ దారుణం కేవలం ఒక కుటుంబ దురంతం కాదు. ఇది భారతదేశంలో ఇప్పటికీ కులం, మతం, పరువు పేరిట జరుగుతున్న మానవ హత్యల భయంకరమైన వాస్తవానికి మరో ఉదాహరణ.

మాచర్లకు చెందిన వ్యాపారి చంద్రశీను కుమార్తె చౌడేశ్వరి అదే ప్రాంతానికి చెందిన నాగరాజును ప్రేమించి, నిశ్చితార్థానికి రెండు రోజుల ముందు వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది. తండ్రి మాత్రం ఆమెను ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నాడు. ప్రేమ వివాహం వల్ల తన పరువు తీసిందన్న ఆగ్రహంతో చంద్రశీను ముందు తన కుమార్తెను నగలు దొంగిలించిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానీ విచారణలో ఆమె కట్టుబట్టలతోనే వెళ్లినట్లు తేలింది. పెద్దల మధ్యవర్తిత్వంతో ఐదు రోజులు పుట్టింట్లో ఉండి మార్చి 19న భర్త వద్దకు వెళ్లాలని ఒప్పందం కుదిరింది. కానీ మార్చి 18న రాత్రి చౌడేశ్వరి అనుమానాస్పదంగా మృతి చెందింది.

పోస్టుమార్టం నివేదికలో ఆత్మహత్య కాదని తేలడంతో పోలీసులు తండ్రిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆయన భార్య, కుమారుడిని పొలానికి పంపి మేనల్లుడు పచ్చిపాల శీనుతో కలిసి నిద్రిస్తున్న కుమార్తె ముఖంపై దిండు అదిమి చంపేశాడని అంగీకరించాడు. ఆ తర్వాత ఆత్మహత్యగా చూపించేందుకు ప్రయత్నించాడు. "కుమార్తె పెళ్లిని ఘనంగా చేయాలనుకున్నాను.. కానీ ప్రేమ పెళ్లి చేసుకుని నా పరువు తీసింది కాబట్టి చంపాను" అని నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

ఇది కేవలం ఒక కేసు మాత్రమే కాదు. జాతీయ నేర రికార్డుల బ్యూరో (చీజ=దీ) డేటా ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 38 పరువు హత్యలు అధికారికంగా నమోదయ్యాయి. ఇది ఆరు సంవత్సరాలలో అత్యధికం. ఝార్ఖండ్‌లో 9, హర్యానాలో 6, మధ్యప్రదేశ్, పంజాబ్‌లో 5 చొప్పున కేసులు నమోదు కాగా ఉత్తరప్రదేశ్‌లో 4 కేసులు ఉన్నాయి. 2022లో 18 కేసులు, 2021లో 33 కేసులు నమోదు కావడం గమనార్హం. ఇవి అధికారిక కేసులు మాత్రమే. ఇంకా ఎన్నో కేసులు ఆత్మహత్యగా, ప్రమాదాలుగా చిత్రీకరించబడుతున్నాయి. వాస్తవ సంఖ్యలు ఇందులో ఎన్నో రెట్లు ఎక్కువ అని సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల సంఘాలు అంటున్నాయి. చీజ=దీ 2024, 2025 సంవత్సరాల పూర్తి గణాంకాలు ఇంకా అధికారికంగా వెలువడలేదు.

పశువులు కూడా తమ సొంత బిడ్డలను చంపుకోవు. ఆడ జంతువులు తమ పిల్లలను రక్షించడానికి ప్రాణాలు త్యాగం చేస్తాయి. కానీ మనిషి..? కులం, మతం, పరువు, గౌరవం అనే మూఢ నమ్మకాల పేరిట తన సొంత రక్తాన్ని, తన బిడ్డను హత్య చేస్తున్నాడు. ఇది క్రూర మృగం కంటే కూడా భయంకరం. ఈ సమాజంలో యువతి ప్రేమించి పెళ్లి చేసుకోవడం పరువు తీయడంగా మారింది. ఆడపిల్ల జీవితం తనది కాదు, కుటుంబం, సమాజం, కులం ఆధీనంలో ఉందన్న భయంకరమైన మనస్తత్వం ఇంకా ఉనికిలో ఉంది. విద్య, ఆధునికత, సమానత్వం అన్నీ కేవలం మాటలకే పరిమితంగా మిగిలిపోతున్నాయి.

చౌడేశ్వరి కేసు మనకు గుణపాఠం చెబుతోంది. పరువు హత్యలు కేవలం కుటుంబ వ్యవహారం కాదు. ఇవి సమాజానికి ముప్పు. ఇవి మానవ హక్కుల ఉల్లంఘన. ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, సమాజం కలిసి ఈ మూఢాచారాలను నిర్మూలించాలి. కులం, మతం అనే గోడలు కూల్చివేయాలి. లేకపోతే మనం మానవులంగా కాకుండా క్రూర మృగాలుగా మారిపోతాము.

### ఉసులుమర్రులో మంత్రి కందుల దుర్గేష్

# విస్తృత పర్యటన



- **వివిధ అభివృద్ధి పనుల పరిశీలన.. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**
- **నిడదవోలు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం పలికిన మంత్రి దుర్గేష్**

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ శుక్రవారం నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**ఆరోగ్య కేంద్రం పనుల పరిశీలన:**నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ. 36 లక్షలతో నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు.

**గోదావరి తీరంలో సౌకర్యాల కల్పన:** ఉసులుమర్రు వద్ద గోదావరి నది రేవు మెట్లపై భక్తులు, స్థానికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న షెడ్ పనులను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. ఎండ, వానల నుండి రక్షణ పొందేలా ఈ షెడ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**రహదారి వెడల్పుపై హామీ:** ఉసులుమర్రు గ్రామంలోని ప్రధాన రహదారికి సంబంధించి 18 ఫీట్ల వెడల్పుకు బదులుగా ప్రస్తుతం 12 ఫీట్ల రహదారి మాత్రమే మంజూరైన విషయాన్ని స్థానికులు మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దుర్గేష్ భవిష్యత్ లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి వెడల్పుతో కూడిన 18 ఫీట్ల ప్రధాన రహదారి మంజూరుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్వాగతం:**అంతకుముందు నిడదవోలు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు మంత్రి కందుల దుర్గేష్ ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ కూటమి నాయకులతో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పలు ప్రాంతీయ అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంచితనానికి మారుపేరు,
విద్యాప్రదాత,
ఉమ్మడి కృష్ణా, గుంటూరు
పట్టభద్రుల ఎమ్మెల్సీ
శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు

జర్నలిస్ట్‌ఫైల్ యాజమాన్యం, సిబ్బంది



శనివారం 04.04.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 347 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఒక్కవైసీపీ మినహా దేశంలోని అన్నిపార్టీలు ఏపీ రాజధాని అమరావతికి అండగా నిలిచాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో అన్ని రాజకీయ పార్టీలూ, ఎంపీలు అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లుపై మద్దతు పలికితే ఒక్క వైసీపీ ఎంపీలు మాత్రమే వ్యతిరేకించి వాకౌట్ చేశారని వ్యాఖ్యానించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం, రాజధాని ఏర్పాటు, అమరావతి ఎంపిక, వైసీపీ కుట్రలు, రాజధాని రైతుల ఉద్యమం, అసెంబ్లీ, మండలిలో జరిగిన పరిణామాలు, న్యాయ పోరాటం, రాజధాని పునర్నిర్మాణం వంటి అంశాలను సీఎం వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఒక్క పార్టీ మినహా దేశంలోని పార్టీలన్నీ రాజధానికి అండగా నిలిచాయి. లోక్ సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తూ 50 పార్టీలు ఉంటే వాటిల్లో వైసీపీ మినహా అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ఇచ్చాయి. రాష్ట్రపతి ఆమోదం తర్వాత దీనికి పూర్తి స్థాయి చట్టబద్ధత వస్తుంది. అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు. లోక్ సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ పార్లమెంటులో ఉండే అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు కృతజ్ఞతలు. రాజకీయ వైరుధ్యాలు, వ్యక్తిగతంగా భిన్నాభిప్రాయాలున్నా అన్ని పార్టీలు సహకారం ఇచ్చాయి. కొందరికి రాష్ట్రం గురించి తెలియదు.. ఈ రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు...కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్ట బద్ధత కల్పించే బిల్లుకు సహకరించాయి. అనుకూలంగా ఓటేశాయి. కానీ ఈ రాష్ట్రంలో ఓట్లు పొంది, ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు ఈ రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే... వైసీపీ మాత్రం మరోవైపు నిలిచింది. వైసీపీ మాత్రమే రాష్ట్రప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు సహకరిస్తాయి. కానీ రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో జగన్ సూచనల మేరకు వైసీపీ ఎంపీలు వ్యవహరించారు. అమరావతి నాశనమై పోయినా పర్వాలేదనుకున్నారు. కానీ మనం దానిపై శాసనం చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజ ముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు."అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**ప్రతీ ఇటుకా పేర్చుకుంటూ వచ్చాం... :** "విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. చాలా అంశాలకు పరిష్కారం చూపకుండానే విభజన జరిగింది. ఆర్ధిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే పోలవరం 7 ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ- గుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమన్నారు. ఆ సంకల్పంలో భాగమే ఉత్తరాంధ్ర-దక్షిణాంధ్ర, రాయలసీమల మధ్య సమాన దూరంలో ప్రాంతాన్ని ఎంపిక చేశాం. కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం. అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక, భూ సమీకరణ, సింగపూర్ సహకారంతో 4 లో..



- వైసీపీ నాశనం చేస్తే -మేం శాసనం చేశాం
- దేశమంతా మద్దతిస్తే వైసీపీ ఒక్కటే వ్యతిరేకించింది
- పార్లమెంటులో చేసిన చట్టాన్నీ గౌరవించరా?
- వైసీపీకి రాష్ట్ర ప్రజలు, వారి ప్రయోజనాలంటే లెక్కలేదు
- ఇక అమరావతిని ఎవరూ మార్చలేరు,కదల్చలేరు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## ఎంఎస్ఎంఈలతో యువతకు ఉపాధి



4లో


- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ/శ్రీసత్యసాయి (జర్నలిస్ట్ ఫైల్) :రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆసక్తి కలిగిన యువత ముందుకొస్తే సబ్సిడీ రుణాలు అందజేసి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఫెర్టిలైజర్స్, పౌల్ట్రీ ఫీడ్ విక్రయ శాలలను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తనను కలిసి విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువతతో చిన్న, మధ్యతరహా పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేసి, వారికి వెన్నుదన్నుగా నిలువనుందని మంత్రి సవిత వెల్లడించారు.

**కూటమి రాకతో పంచాయతీలకు పూర్వవైభవం**

వైసీపీ పాలనలో నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. పాడైపోయిన వీధి బల్బులను సైతం మార్చడానికి కూడా వీలుండేది కాదన్నారు.

## సూక్ష్మ సేద్యంలో అగ్రస్థానంలో ఏపీ



- రాష్ట్రంలో 1.26 లక్షల హెక్టార్ల పరిధిలో సూక్ష్మ సేద్యం
- రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపినందుకు అధికారులకు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి, రికార్డు స్థాయిలో 1,26,057 హెక్టార్లను సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకువచ్చిన అధికారులను, సిబ్బందిని మిగతా 4లో...

## రాజధాని అభివృద్ధికి ప్రధాని మోదీ పూర్తి సహకారం



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది పడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తోందని, రూ.27 వేల కోట్ల రుణాలకు కేంద్రం గ్యారెంటీగా నిలబడటం వల్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బెంజి సర్కిల్, కనకదుర్గ ఫ్లైఓవర్ల నిర్మాణం కేంద్ర సహకారంతోనే సాధ్యమైందని, విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు కేంద్ర ప్రభుత్వ కృషి ఫలితమని అన్నారు. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మిగతా 4లో...

## జాతీయ రహదారుల విస్తరణకు సహకరించండి

- కేంద్ర సహకారం కోరిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులను వేగవంతం చేయడానికి కేంద్ర సహకారం అవసరమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కేంద్ర రోడ్లు, రవాణా మరియు హైవే శాఖ సెక్రటరీ ఉమాశంకర్ టి.తో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారుల ప్రాజెక్టుల అమలు, విస్తరణ పనులు, పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించిన కీలక జాతీయ రహదారి ప్రాజెక్టులకు మంజూరు కల్పించి, వాటి అమలును వేగవంతం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమన్వయంతో



పనిచేస్తున్నందున జాతీయ రహదారుల అభివృద్ధి వేగంగా జరుగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో భూసేకరణ, అటవీ అనుమతులు, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి ప్రాజెక్టుల అమలుకు సహకరిస్తున్నట్లు వివరించారు. మిగతా 4లో...

### ఇరిగేషన్ అధికారుల అలసత్వంపై

## మంత్రి నిమ్మల ఆగ్రహం

- అధికారులు తీరు మార్చుకోవాలన్న మంత్రి నిమ్మల
- ఆదివారంలోగా అంచనాలు సమర్పించాలని ఆదేశం
- సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని హెచ్చరించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబంధించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, 4లో...

# రైతుల ఆనందానికి అద్దం పట్టిన ఆలపాటి ఎడ్ల బల పోటీలు



రైతాంగ సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి అనే లక్ష్యాలతో నిరంతరం శ్రమిస్తున్న ప్రజానాయకుడిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక గుర్తింపు పొందారు.రైతాంగ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తూ, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ, రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో ఆయన చూపుతున్న చిత్తశుద్ధి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఎడ్లబల ప్రదర్శనలు వంటి సాంప్రదాయ క్రీడలకు కొత్త ఊపునిస్తూ, యువతలో వ్యవసాయంపై ఆసక్తిని పెంపొందించడంలో ఆయన పాత్ర కీలకంగా మారింది.

ప్రజలతో సన్నిహితంగా మమేకమై వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపే నాయకుడిగా ఆయనకు విశేష ప్రజాదరణ ఉంది. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే దిశగా ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయంగా నిలుస్తోంది. సేవా భావం, కట్టుబాటు, నాయకత్వ లక్షణాల సమ్మిళితంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ, అభివృద్ధి దిశగా కృషి చేస్తున్న ప్రజానాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. మిగతా 4లో...



## ఆర్సిఎం చర్చిలో గుడ్ ఫ్రైడే సంబరాలు



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ): బి.మఠం మండల టౌన్ పరిధిలోని ఆర్.సి.యం చర్చి ప్రాంగణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు విచారణ గురువులు ఫాదర్ రవిచంద్ర పాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫాదర్ సునీల్, ఫాదర్ జయరాజు హాజరై ప్రార్థించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విచారణ యువకులు నటించిన యేసు సిలువ మార్గం సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ, చల్లటి పానీయాలు విశ్వాసులకు పంపిణీ చేశారు. ఆర్.సి.ఎం చర్చి లో భక్తి యుక్తంగా గుడ్ ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

## ముస్లిం స్మశాన వాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో తాడేపల్లి పోలకంపాడు లోని ముస్లీం స్మశాన వాటికలో అభివృద్ధి చేయనున్న పనులకు రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యన్నారాయణ లు టీడీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో కలిసి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్మశాన వాటికలలో షెల్టర్, స్మశానం లోపల వరకు సీసీ రోడ్డు, నీటి సదుపాయం, సేద తీరడానికి సిమెంట్ బల్లలు, లైటింగ్, గోడలకు రంగులు, మరుగుదొడ్ల అన్ని హంగులతో ఈ ముస్లిం బరియల్ గ్రౌండ్ లో సదుపాయాలు కల్పించనున్నారు, ఈ సందర్బంగా మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోని స్మశాన వాటికలను తన సొంత నిధులతో అభివృద్ధి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు, అఖరి మజిలీలో వారికి కుటుంబ సభ్యులు సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించి గౌరవప్రదంగా సాగనంపాలనే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ స్మశాన వాటికలను అన్ని హంగులతో అభివృద్ధి చేస్తున్నారని, మంగళగిరి ని మోడల్ నియోజకవర్గం గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు, ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లిం సోదరులు, పోలకంపాడు పరిధిలో వున్న ఆరు మసీదుల ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.

## ఎస్‌డిఎం జ్యువెలర్స్ అధినేత దలిచంద్ జైన్ మృతి



### ○ సంతాపం తెలిపిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): ఎస్‌డిఎం జ్యువెలర్స్ అధినేత దలిచంద్ జైన్ మృతికి శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని వారి నివాసానికి వెళ్లి ఆయన కుమారులైన ముకేష్ జైన్, బంటిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, దలిచంద్ జైన్ మృతి నగల వ్యాపార రంగానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బంగారు ఆభరణాల వర్తకుల తలలో నాలుకలా మెదలడమే కాక వారికి ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటి పరిష్కారానికి ఎళ్ళవేళలా ముందుండే వారని గుర్తు చేసుకున్నారు. మరోవైపు పూర్తి ధార్మిక చింతనతో ఆధ్యాత్మిక రంగంలో కూడా ఆయన చురుకైన పాత్ర పోషించేవారని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, గీతా మందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, ఓర్చు శ్రీనివాసరావు, హనుమంతరావు, విమల్ చంద్, ప్రవీణ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు మార్గం అనుసరణీయం : ఎమ్మెల్యే నసీర్

### ○ శాంతి, సమాధానం క్రీస్తు జీవితం
### ○ గుర్రం జాషువా సమాధి వద్ద నివాళులర్పించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఏసుప్రభు స్ఫూర్తితోనే సమాజ సేవ కొనసాగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం సుద్దపల్లిడొంకలోని శ్మశాన వాటికలో గుర్రం జాషువా సమాధి వద్ద ఎమ్మెల్యే నసీర్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి శాంతి మార్గాన్ని క్రీస్తు తన జీవితం ద్వారా తెలియజేశారని చెప్పారు. సహనాన్ని ఆయుధంగా మలుచుకొని ప్రతి ఒక్కరిలో మంచి గుణాలను పెంపొందించాలని చెప్పారు. క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. సకల మానవులకు శాంతి చేకూర్చాలని క్రీస్తు జన్మించారని తెలిపారు. ప్రతి ఒక్కరిలో దయాగుణం అలవర్చుకునేలా తన జీవితాన్ని కొనసాగించాలని చెప్పారు. మానవజాతి కోసం తన రక్తాన్ని చిందించిన యేసు తిరిగి పునరాత్థానుడై తిరిగి వస్తారని తెలిపారు. దీని ద్వారా ప్రతి మనిషి ఎలాంటి కష్టం వచ్చినా ఎదుర్కొని నిలిస్తే విజయాలు సొంతమవుతాయనే సందేశాన్ని అందించారని వివరించారు.

## బీసీల హక్కుల సాధనకు బిసివై పార్టీ కేంద్ర కార్యాలయంలో 'బీసీ ధర్మదీక్ష'

### ○ ఏప్రిల్ 11 నుంచి రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం భారత చైతన్య యోజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఏప్రిల్ 11వ తేదీ నుండి బీసీ ధర్మదీక్ష పేరుతో బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తోట శివరాం ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. శుక్రవారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తోట శివరాం ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, పూలే మండల్ భవన్ వేదికగా మంగళగిరి బిసివై పార్టీ కేంద్ర కార్యాలయంలో దీక్షకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. బీసీ సింహగర్జన సభలో ప్రభుత్వం ముందుంచిన ఐదు కీలక డిమాండ్లపై మార్చి 31 వరకు ఇచ్చిన గడువు ముగిసినా ఎలాంటి సానుకూల స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా బీసీలు ఎదుర్కొంటున్న అన్యాయాలకు వ్యతిరేకంగా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రామచంద్ర యాదవ్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
బీసీల సామాజిక భద్రత కోసం ప్రత్యేక బీసీ రక్షణ చట్టం అమలు చేయాలి.
అమరావతి రాజధానిలో బీసీల కోసం భవనాల నిర్మాణానికి భూములు కేటాయించాలి.
రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ కులగణన చేపట్టి ఖచ్చితమైన జనాభా లెక్కలు వెల్లడించాలి. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. నిర్వీర్యమైన బీసీ కార్పొరేషన్లకు తక్షణమే నిధులు విడుదల చేసి యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వం బీసీల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఈ ధర్మదీక్షకు సంఘీభావం తెలుపుతూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో బిసివై పార్టీ రాష్ట్ర మహిళా కో కన్వీనర్ కాగితాల స్వాతి, గుంటూరు జిల్లా మహిళా కన్వీనర్ కొణతం చాముండేశ్వరి దేవి, యర్రకుల భాస్కర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ చర్చిలో ఘనంగా శుభశుక్రవార ప్రార్థనలు



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): కల్వరి శిలువపై ఏసుక్రీస్తువారు పలికిన ఏడు మాటలలో మొదటిమాట, తండ్రీ వీరేమి చేయుచున్నారో, వీరెరుగరు గనుక వీరిని క్షమించుమన్న మాటద్వారా , అపకారము చేయువారిని కూడా క్షమించు నీతిని, ఏసుక్రీస్తు మార్గంలో ఉన్నవారందరు అలవర్చుకుని శాంతి సమాధానం పొందాలని, శతవార్షిక క్రీస్తు దేవాలయంలొ నిర్వహించిన గుడ్ ఫ్రైడె వేడుకల్లొ దేవరపల్లి ఏసురత్నం వాఖ్య పరిచర్య చేశారు. పట్టణ బోస్ రోడ్ లోని శతాధిక వత్సరాల, క్రైస్తవ ఆరాధనా మహిమగల క్రీస్తు దేవాలయంలొ శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్ధనల్లొ, పట్టణంలోని పలు ప్రాంతాల క్రీస్తు ఆరాధకులు వారి సంప్రదాయ రీతిన చర్చి ప్రాంగణానికి చేరుకున్నారు. క్రీస్తు ఏసు శిలువపై పలికిన ఏడుమాటలకు ఉన్న ప్రాధాన్యతను దైవ జనులు వారిదైన శైలిలో వివరించారు. ప్రార్ధనా గీతాలు, ప్రత్యేక ప్రార్ధనలతొ టౌన్ చర్చి ప్రాంగణంలొ, సంఘ మహిళలు, మౌనంగా వాఖ్య అర్ధాన్ని ఆలకించారు. దగ్గుమల్లి సాల్మన్ రాజు ఎమ్ విబి. ప్రకాష్ బాబు, పిడకాల డేవిడ్ ఇమ్మానుయేల్ ఆరాధనలు నిర్వహించారు. జల్లిగంటయ్య, వేము రామరాజు, ఐనంపూడి డేవిడ్ రాజు, గురిందపల్లి వేమయ్య ప్రత్యేక గీతాలు ఆలపించారు. దైవ వంస్తమాన సేవలతో టౌన్ చర్చి ప్రాంగణం క్రీస్తు మహిమా లయంగా పరిడ విల్లింది. అదేవిధంగా, ఐతానగర్, చినరావూరు, చెంచుపేట ప్రాంతాల్లోని దేవుని మందిరాల్లో గుడ్ ఫ్రైడే ప్రార్ధనలు నిర్వహించారు. ఐతానగర్ క్రీస్తు కృపాలయం ఆధ్వర్యంలో, శిలువ మోసిన క్రీస్తు ఏసు ప్రదర్శనను, పురవీధులలో నిర్వహించారు. మహిళలు విశేషంగా పాల్గొన్నారు.

## కొండపాటూరు పోలేరమ్మకు కుంకుమ పూజ

### ○ భారీగా హాజరైన భక్తులు
### ○ ఈ నెల 7 వ తేదీన పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం



కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర లో భాగంగా శుక్రవారం నాడు అమ్మవారి ఆలయం నందు కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజ కు భారీగా మహిళా భక్తులు హాజరయ్యారు. భక్తులకు హాజరైన భక్తులకు అవసరమైన పూజా సామాగ్రి మరియు ఏర్పాట్లు ను ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులు పర్యవేక్షంచారు. పూజారులు ప్రత్యేకంగా పూజ లు నిర్వహించారు. కుంకుమ పూజా కార్యక్రమం సందర్భంగా పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది విశేషంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. భక్తుల కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను నిర్వహిస్తున్నమన్నారు. ఈ నెల 7 వ తేదీ మంగళవారం నాడు పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### అమ్మవారిని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్

జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి కొండపాటూరు గ్రామంలో వెంచేసియున్న స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి ని దర్శించుకున్నారు. అనంతరం పోలేరమ్మ అమ్మవారి కుంకుమ పూజ లో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భక్తులకు అమ్మవారి పై ఉన్న భక్తి, నమ్మకం వెల కట్టలేనిదని తెలిపారు.
పోలేరమ్మ చల్లని దయ ప్రజలదరి పై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనకు పక్కా ప్రణాళికలు ఉండాలి : కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): లక్ష్య సాధనకు పక్కా ప్రణాళికలు ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో ఆయా శాఖల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీకలవాగు, కొండవీటివాగు వంటి వరద ప్రభావిత వాగులపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని ఆదేశించారు. ఎం.ఎస్.ఎం.ఇ పార్కులను ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ మోడల్ లో ఏర్పాటుకు నియోజక వర్గాల్లో రెండు ఎకరాల స్థలం గుర్తించాలన్నారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగు నీరు అందించుటకు అవసరం ఉన్న అన్ని గ్రామాలను జల్ జీవన్ మిషన్ లో పెట్టుటకు అవకాశాలు పరిశీలించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ శత శాతం ఉపయోగించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. గుంటూరు చానెల్, గుంటూరు నల్లా, పీకలవాగుల వరద తీవ్రత లేకుండా స్పష్టమైన చర్యలు చేపట్టడం, అవసరమైతే సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో ఎస్.టి.పి నిర్మాణం దిశగా ఆలోచన చేయాలని ఆదేశించారు. సజావుగా నీటి పారుదల ఉండుటకు వాగుల్లో ప్లాస్టిక్ నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజధానిలో జరుగుతున్న పనులకు మెటీరియల్ కొరత లేకుండా గనుల శాఖ అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వర్యులతో ఈ నెల 7వ తేదీన ఉన్న జిల్లా సమీక్ష సమావేశానికి నిర్దిష్టమైన అంశాలతో సమగ్ర ప్రణాళికలను సమర్పించాలని ఆదేశించారు.
గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ పీకలవాగు ఆక్రమణలకు గురికావడం వలన వరదలు వచ్చినపుడు గుంటూరు పట్టణంలో కొన్ని ప్రాంతాలు ముంపుకు గురి అవుతున్నాయని, ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయో సర్వే జరుగుతోందన్నారు. జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం మాట్లాడుతూ బందారుపల్లి ఛానెల్, గుంటూరు చానెల్, కొండవీటివాగు, గుంటూరు నల్లా, పీకలవాగులపై వివరించారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.శ్రీనివాస రావు, లక్ష్మీ కుమారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.ఎన్.కిరణ్ కుమార్, పర్యాటక అధికారి రమ్య, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ. గాయత్రి దేవి, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా ఇంచార్జి మంత్రి రాక



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా ఇంచార్జి మంత్రి , రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం జిల్లాకు రానున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొననున్నారు.

## ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వివరించగా, వాటిని సంబంధిత శాఖలకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా మారిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల అర్జీలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వెంటనే స్పందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచార యత్నం...!

### ○ దాహమని నీళ్లడిగి డ్రామా,
### ○ ఇంట్లోకి చొరబడి అమానుషం
### ○ సత్తెనపల్లికి చెందిన మహిళపై దారుణం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): పల్నాడు జిల్లా మాచర్లలో దారుణం జరిగింది. మాచర్లలో ఓ ప్రభుత్వ ఉద్యోగినిపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. తలుపు కొట్టి దాహమని నీళ్లు అడిగి కత్తితో బెదిరించి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు.
సత్తెనపల్లికి చెందిన మహిళ మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. ఆమె పట్టణంలోని 13వ వార్డు రైల్వే స్టేషన్‌కి సమీపంలో ఏడాదిగా నివాసం ఉంటున్నారు. బాధితురాలు భర్తకు దూరంగా ఉంటున్నారు.. ఆమె తన అక్క కుమారుడిని దత్తత తీసుకున్నారు. అయితే శుక్రవారం గుడ్‌ఫ్రైడే సెలవు దినం కావడంతో సత్తెనపల్లికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.
గురువారం రోజు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఆమె ఇంటి డోర్ కొట్టాడు.. దాహంగా ఉందని చెప్పి తాగడానికి నీళ్లు అడిగాడు. ఆమె నీళ్లు తీసుకొచ్చేందుకు ఇంట్లోకి వెళ్తుండగా.. అతడు కూడా ఇంట్లోకి వెళ్లాడు. తన వెంట తెచ్చిన కత్తిని ఆమె మెడపై పెట్టి బెదిరించాడు. ఆమె చేతుల్ని, కాళ్లను చున్నీతో కట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అతడు బాధితురాలిని గాయపరచడంతో స్పృహ కోల్పోయింది. ఆమెకు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో దత్తత కుమారుడికి అనుమానం వచ్చింది. వెంటనే తన స్నేహితుల్ని ఇంటికి పంపించాడు.
వారు ఇంటికి వచ్చి చూడగా ఈ దారుణం బయటపడింది. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చి.. వెంటనే బాధితురాలిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహా మేరకు నరసరావు పేటలోని ఆస్పత్రికి తరలించారు.
ఈ ఘటనపై మాచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు. అత్యాచార ఘటనపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహానందరెడ్డి స్పందించారు. గుంటూరు రేంజ్ త్రిపాఠితో మాట్లాడారు.
ఈ కేసులో నిందితుడ్ని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుంది అన్నారు.
అయితే పోలీసులు ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# డప్పు కళాకారులకు ప్రభుత్వ చేయూత అవసరం





- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** సంప్రదాయ డప్పు వాయిద్య కళాకారులకు ప్రభుత్వ పరంగా మరింత ప్రోత్సాహం, సంక్షేమ చర్యలు అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన డప్పు కళాకారుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.
డప్పు వాయిద్యం రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని, దీనిని కాపాడుతూ కళాకారులకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డప్పు కళాకారులతో త్వరలోనే భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పెన్షన్ పొందని కళాకారులకు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పెన్షన్ మొత్తాన్ని పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. పంచాయతీ వ్యవస్థలో దండోరా వేసే పోస్టులను పునరుద్ధరించడం, దేవాలయాలు మరియు ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల్లో డప్పు కళాకారులకు అవకాశాలు కల్పించడం దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. అదేవిధంగా 'ఆదరణ' వంటి పథకాల ద్వారా వాయిద్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు.
సమావేశంలో పాల్గొన్న కళాకారులు తమ సమస్యలను ప్రస్తావిస్తూ, డప్పు తయారీలో ఉపయోగించే తోలు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యగా పేర్కొన్నారు. తోలు పరిశ్రమ ద్వారా అవసరమైన ముడి పదార్థాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. తరం తరంగా కొనసాగుతున్న ఈ వృత్తికి గౌరవం, ఆర్థిక భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ, డప్పు కళాకారుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు చర్యలు చేపడతామని తెలిపారు. సంస్కృత తెలుగు అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ మాట్లాడుతూ, డప్పు వాయిద్య కళాకారుల సమస్యలపై తమ వంతు గొంతుకగా నిలుస్తామని తెలిపారు. దేశ సంస్కృతిలో డప్పు కళాకారులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. చాటింపు ద్వారా ప్రభుత్వ సమాచారం ప్రజలకు చేరవేసే వారిగా డప్పు కళాకారులు వ్యవహరిస్తారని అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో బుల్లా రాజారావు (చర్మకారుల సంఘం అధ్యక్షుడు), పరగొండ జోషి (ఏపీటీకేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు), మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ప్రోత్సహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన



- మన్నవ వెల్లడి
- ఎమ్మెల్సీ ఆలపాటి ఆధ్వర్యంలో జరుగుతున్న ఒంగోలు జాతి జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తిలకించిన మన్నవ
- ఆలపాటిని అభినందించిన మన్నవ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కీ.శే. ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారకార్థం నిర్వహిస్తున్న "ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బల, పశుపాల ప్రదర్శన" కార్యక్రమంలో శుక్రవారం ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు మన ఆంధ్రప్రదేశ్ గర్వకారణం. ఇలాంటి కార్యక్రమాలు మన పశుసంపదను పరిరక్షించడంలో, రైతులకు ప్రోత్సాహం ఇవ్వడంలో ఎంతో ఉపయోగపడతాయి. ఇంత గొప్ప కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి, నిర్వాహకులకు మన్నవ మోహన కృష్ణ అభినందనలు తెలిపారు.

## అరణ్ములలో ఎన్‌డీఏ గెలుపే లక్ష్యం



- నియోజకవర్గ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ

**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళం లోని అరణ్ముల అసెంబ్లీ నియోజకవర్గంపై బీజేపీ ప్రధానంగా దృష్టి సారించిందని, ఎన్‌డీఏ అభ్యర్థి కుమ్మనం రాజశేఖరన్ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని మిత్రపక్షాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని నియోజకవర్గ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు.
శుక్రవారం అరణ్ములలోని ఎన్‌డీఏ ఎన్నికల కార్యాలయంలో బీజేపీ కేరళం రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి వినోద్ తవిడే, అభ్యర్థి కుమ్మనం రాజశేఖరన్‌తో కలిసి బూత్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో బూత్ స్థాయిలో అమలు చేయాల్సిన ఎన్నికల ప్రణాళిక, కార్యాచరణపై మండల నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలకు వినోద్ తవిడే దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.
ప్రతి ఓటరును వ్యక్తిగతంగా సంప్రదించడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించినట్లు చెప్పారు.
అరణ్ములలో ఈసారి ఎన్‌డీఏ విజయం సాధించడమే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి సమగ్ర వ్యూహంతో ముందుకు సాగుతున్నామని జయప్రకాష్ పేర్కొన్నారు. ప్రతి బూత్‌ను బలపరచడం ద్వారా గెలుపును సులభం చేయగలమని, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే విజయం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.
ఓటర్లతో నిరంతర సంబంధం కొనసాగిస్తూ, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల వరకు ప్రతి రోజు కార్యాచరణను సమర్థంగా అమలు చేస్తూ గెలుపు దిశగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.
ఈ సమావేశంలో వల్లూరు జయప్రకాష్ నారాయణతో పాటు పలువురు మండల స్థాయి నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివాజీ మహారాజ్ స్ఫూర్తితోనే భారత్ 'విశ్వగురు'



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు. విజయవాడలోని సత్యనారాయణపురంలో శివాజీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
ముగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి హైందవ స్వరాజ్యాన్ని స్థాపించిన శివాజీ మహారాజ్ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించారని తెలిపారు. తల్లి జిజియాబాయి స్ఫూర్తితో ఆయన అనేక కోటలను నిర్మించి స్వరాజ్యాన్ని స్థాపించారని, రాయగడలో పట్టాభిషేకం అనంతరం హైందవ చైతన్యం విస్తరించిందని వివరించారు. శివాజీ మహారాజ్‌ను ప్రజలు దైవస్వరూపంగా భావించేవారని పేర్కొన్నారు.
ఆంధ్ర ప్రాంతంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, శివాజీ యాత్ర విశాఖపట్నం వరకు సాగిందని, శ్రీశైలంలో తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయని చెప్పారు.
ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, స్వధర్మంపై గౌరవం పెంపొందించుకోవాలని మాధవ్ పిలుపునిచ్చారు. వామపక్ష హింసను అణచివేయడంలో కేంద్ర ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ, దేశ భద్రతలో కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో, 'సర్వధర్మ సమభావన' భావజాలం భారతదేశాన్ని ప్రపంచానికి మార్గదర్శిగా నిలబెడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శివాజీ ఆశయాలను సమాజంలోని ప్రతి వర్గానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కృష్ణ నాగలింగం శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## నంగిలాల్‌కు నాలుగు చక్రాల తోపుడు బండి అందజేత



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నల్లచెరువుకు చెందిన దిలావత్ నంగిలాల్ తమ కుటుంబ పోషణ కోసం నాలుగు చక్రాల తోపుడు బండి అవసరమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని వినతిపత్రం ద్వారా కోరారు. నంగిలాల్ కుటుంబ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే స్పందించి, తన సొంత ఖర్చుతో నాలుగు చక్రాల తోపుడు బండిని తయారు చేయించి సహాయం అందించారు. శుక్రవారం నాడు నిర్వహించిన గ్రీవెన్స్ అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆ తోపుడు బండిని నంగిలాల్‌కు స్వయంగా అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్థిరపడాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ఈ తోపుడు బండి ద్వారా నంగిలాల్ తన జీవనోపాధిని మెరుగుపర్చుకుని కుటుంబాన్ని నడిపించగలడని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నంగిలాల్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధతతో ఉద్యోగుల్లో నెలకొన్న అనిశ్చితికి ముగింపు

- బకాయిల విడుదలతో ఆర్థిక భరోసా
- ఏపీ ఎన్జీజీవో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం ఉద్యోగుల్లో నెలకొన్న అనిశ్చితికి ముగింపు పలికారని ఏపీ ఎన్జీజీవో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు.
గుంటూరులోని ఎన్జీజీవో హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, హెచ్ఓడీలలో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు రాజధాని మార్పులపై ఉన్న సందిగ్ధత నుంచి బయటపడ్డాయని చెప్పారు. ఈ నిర్ణయం ఉద్యోగుల్లో నమ్మకాన్ని, స్థిరత్వాన్ని పెంచిందన్నారు.
రాష్ట్రానికి శాశ్వత రాజధాని ఏర్పాటు చేసి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సంవత్సరాంతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రూ.7,358.33 కోట్ల బకాయిల విడుదలను స్వాగతిస్తూ, ఇది ఆర్థిక భారం తగ్గించడంలో కీలకమని పేర్కొన్నారు.

**బకాయిల చెల్లింపులు వివరాలు**

జి.పి.ఎఫ్ కింద రూ.1,847.83 కోట్లు, గ్రాట్యుటీ కింద రూ.3,411.03 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎంకాష్మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీసు సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ కింద రూ.223.47 కోట్లు చెల్లింపులు జరుగనున్నట్లు తెలిపారు. ఈ చెల్లింపులు ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడతాయని చెప్పారు.
సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ కృషిని అభినందించారు. ప్రభుత్వం సానుకూల వైఖరితో ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వం--సంఘం సమన్వయం వల్ల ఉద్యోగులకు మేలు జరుగుతోందన్నారు.
రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ, ఇప్పటికే జి.పి.ఎఫ్ కింద రూ.1,847.83 కోట్లు జమయ్యాయని, గ్రూప్ ఇన్సూరెన్స్ కింద రూ.76 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు.
అమరావతి రాజధాని నిర్ణయం, బకాయిల విడుదల రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా స్థిరత్వానికి దోహదమని చెప్పారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షుడు సిహెచ్ రాంబాబు, ఉపాధ్యక్షుడు బి. దుర్గారావు, సంయుక్త కార్యదర్శులు జానీ పాషా, బి. కృష్ణ కిషోర్, కే. నరసింహారావు, కే. విజయ్, గుంటూరు సిటీ కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, సిటీ ఉపాధ్యక్షులు సాంబశివరావు, మురళి కృష్ణ, అంకమ్మరావు, శ్రీనివాసరావు, పత్తిపాడు అధ్యక్షుడు కే. శేషగిరి రాజు, అమరావతి కార్యదర్శి షేక్ ఖరీం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్‌లో ఉర్దూ అధ్యయనంతో ఉపాధి అవకాశాలు విస్తరణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో రెండవ అధికార భాషగా ఉన్న ఉర్దూను ఇంటర్మీడియట్ స్థాయిలో ద్వితీయ భాషగా అభ్యసించడం ద్వారా విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉర్దూ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ప్రత్యేక అధికారి షేక్ నాగూర్ వలి తెలిపారు.
శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం, ఏ గ్రూప్‌లోనైనా ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు ఉర్దూను ద్వితీయ భాషగా ఎంచుకుని భవిష్యత్తులో పలు రంగాల్లో స్థిరపడే అవకాశాలు పొందవచ్చన్నారు. ఉర్దూ టీచర్ ట్రైనింగ్ కోర్సులు చేయడం ద్వారా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించవచ్చని సూచించారు.
ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చదివిన విద్యార్థులు ఎంసెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలను ఉర్దూ భాషలో రాయవచ్చని, తద్వారా ఇంజినీరింగ్, వైద్య విద్యలో (యునాని వైద్యం సహా) ప్రవేశం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, లాసెట్ పరీక్షను ఉర్దూలో రాసి ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు పూర్తి చేసి న్యాయవాద వృత్తిలో స్థిరపడవచ్చన్నారు.
రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ద్వారా డిగ్రీ స్థాయిలో కూడా ఉర్దూ భాషను అభ్యసించే అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు కూడా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హాజరు మినహాయింపుతో ఒకేసారి మొదటి, రెండవ సంవత్సరాల ఉర్దూ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉందని వివరించారు. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ, ఇంటర్మీడియట్‌లో ఉర్దూను ద్వితీయ భాషగా ఎంచుకోవడం ద్వారా తమ భవిష్యత్తుకు మెరుగైన దిశలో అడుగులు వేయాలని ఆయన సూచించారు.

## రాష్ట్రంలో మూడు రోజులపాటు తీవ్ర వడగాల్పులు

- వాతావరణ శాఖ హెచ్చరిక
- 73 మండలాల్లో తీవ్ర వడ కాల్పులు వీచే అవకాశం
- 17 మండలాల్లో వడగాల్పులు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**రాష్ట్రంలో 73 మండలాల్లో తీవ్రవడగాలులు, 17 మండలాల్లో వడగాలులు, ఆదివారం 32 మండలాల్లో తీవ్రవడగాలులు, 21 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం తెలిపారు. శనివారం శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరం 24, పార్వతీపురంమన్యం 15, అల్లూరి 3, పోలవరం 9, అనకాపల్లి 2, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాల్లో మొత్తం 73 మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం 2, పోలవరం 2, అనకాపల్లి 1, కాకినాడ 2, తూర్పుగోదావరి 3, ఏలూరు 4, ఎన్టీఆర్ 1, పల్నాడు 2 మండలాల్లో మొత్తం 17 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. శుక్రవారం మన్యం(జి) భామినిలో 41.8లీజ, చిత్తూరు(జి) రాయలపేటలో 41.4లీడిగ్రీ సెంటిగ్రేడ్లు అనకాపల్లి(జి) నాతవరంలో 40.9లీ డిగ్రీ సెంటిగ్రేడ్లు, శ్రీకాకుళం(జి) జి.సిగడాంలో 40.5లీడిగ్రీ సెంటిగ్రేడ్లు నంద్యాల (జి) ఆలమూరు, కడప(జి) బద్వేల్ లో 40.4లీడిగ్రీ సెంటిగ్రేడ్లు, ఏలూరు(జి) ధర్మాజీగూడెం, తిరుపతి(జి) రేణిగుంట, విజయనగరం(జి) రాజాంలో 40.3లీడిగ్రీ సెంటిగ్రేడ్, కృష్ణా(జి) కంకిపాడులో 40.1లీజ, కర్నూలు(జి) తోవి 40లీసెంటిగ్రేడ్ల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. వడగాలుల వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్ధులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓ ఆర్ ఎస్, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలని,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్ర బీమా పథకం అమలు చేయాలి: ఫోర్టో


**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి సమగ్ర ఆరోగ్య, జీవ, టర్మ్ బీమా పథకాన్ని ప్రభుత్వం తక్షణమే ప్రవేశపెట్టాలని ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) కోరింది. సంస్థ చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య తదితరులు విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.
ప్రస్తుతం అమలులో ఉన్న ఆరోగ్య పథకం ప్రయోజనకరమైనదైనా, పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో పరిమిత కవరేజ్ కారణంగా ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జీవ, టర్మ్ బీమా రక్షణ లేకపోవడం వల్ల అనూహ్య పరిస్థితుల్లో కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి గురవుతున్నాయని తెలిపారు.
రాష్ట్రంలో సుమారు 6 లక్షల రెగ్యులర్ ఉద్యోగులు, 3 లక్షల పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 30 లక్షల మందికి ప్రయోజనం చేకూరే విధంగా సమగ్ర పథకాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రతిపాదిత పథకం ప్రకారం ప్రతి వ్యక్తికి సంవత్సరానికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా, కుటుంబానికి రూ.30 లక్షల ఫ్లోటర్ కవరేజ్, విస్తృత ఆసుపత్రుల నెట్‌వర్క్ ద్వారా క్యాష్‌లెస్ చికిత్స, దీర్ఘకాలిక మరియు క్లిష్ట వ్యాధులకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.
అదేవిధంగా మరణం సంభవించినపుడు రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు జీవ బీమా, కుటుంబానికి నిర్దిష్ట కాలానికి నెలవారీ ఆదాయ మద్దతు అందించే టర్మ్ బీమా సదుపాయం ఉండాలని సూచించారు. ఈ పథకాన్ని జాతీయీకృత బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల సహకారంతో పారదర్శకంగా అమలు చేయాలని పేర్కొన్నారు.
ప్రీమియం నిర్మాణం ప్రకారం ప్రతి లబ్ధిదారుకు సంవత్సరానికి సుమారు రూ.17,000 వ్యయం అవుతుందని, అందులో 70 శాతం ప్రభుత్వం, 30 శాతం ఉద్యోగి లేదా పెన్షనర్ భరించే విధానం ఉండాలని ప్రతిపాదించారు. సంవత్సరానికి సుమారు రూ.10,700 కోట్ల వ్యయం అంచనా వేయబడినప్పటికీ, ఇది ఉద్యోగుల సామాజిక భద్రత, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి అవసరమైన పెట్టుబడిగా పేర్కొన్నారు.
పారదర్శక అమలుకు గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మానవ వనరుల నిపుణులు, విరమణ పొందిన ఉన్నతాధికారులతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం తక్షణమే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, సంబంధిత బ్యాంకులు, బీమా సంస్థలతో సంప్రదింపులు ప్రారంభించి దశలవారీగా పథకాన్ని అమలు చేయాలని ఫోర్టో కోరింది. ఈ పథకం అమలుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రతతో పాటు ఆర్థిక రక్షణ కలుగుతుందని తెలిపారు.

## జై అమరావతి...జై మోదీ... అమరావతి చట్టబద్ధతపై మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

- గుంటూరు జిల్లా బీజేపీ సంబరాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లుకు ఆమోదం లభించిన నేపథ్యంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. నగరంలోని లక్ష్మీపురం అటల్ బిహారీ వాజపేయి సర్కిల్ వద్ద బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, వాజపేయి విగ్రహానికి పూలమాలలు అర్పించారు.
ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి కృషితో అమరావతికి చట్టబద్ధత లభించిందని పేర్కొన్నారు. గతంలో రాజధాని అంశాన్ని నిర్వీర్యం చేసిన పరిస్థితుల్లో ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. అమరావతి అభివృద్ధికి కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ, రాజధాని అంశంపై గతంలో ఏర్పడిన వివాదాల నేపథ్యంలో అసెంబ్లీ ద్వారా బిల్లును పార్లమెంట్‌కు పంపడం కీలకమైందని చెప్పారు. ఎన్డీఏ కూటమి మద్దతుతో రాజధాని అంశానికి స్పష్టత వచ్చినట్లు తెలిపారు.
తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్ర విభజన అనంతరం రాజధాని సమస్య కొనసాగుతున్న సమయంలో అమరావతికి చట్టబద్ధత లభించడం ఒక ముఖ్యమైన పరిణామమని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను గుర్తుచేశారు.
పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర--రాష్ట్ర సమన్వయం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతాయని తెలిపారు.
జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ నిర్ణయం అమరావతి అభివృద్ధికి కొత్త దిశను అందిస్తుందని పేర్కొన్నారు. రాజధాని కోసం పోరాటం చేసిన రైతులకు ఈ నిర్ణయం ఊరటనిస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో దర్శనపు శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, చరక కుమార్ గౌడ్, శ్రావణ కుమారి, జనసేన నాయకులు ఆళ్లహరి, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, నడ్డి నాగమల్లేశ్వరి, డాక్టర్ ఉమాశంకర్, నేరళ్ళ మాధవరావు, నారాయణరెడ్డి, రావూరి నారాయణ శాస్త్రి, సాధు రామకృష్ణ, మంత్రి సుగుణ, సురేష్ జైన్, షేక్ రఫీ, అబ్దుల్ ఖుద్దుస్, డాక్టర్ రాధామాధవి, ధారా అంబేద్కర్, షేక్ సాంబశివరావు, తురక రామారావు, తుంగ యశ్వంత్, బెహరా గాయత్రి, మల్లాల లక్ష్మణ్, నాగమల్లేశ్వరి, డాక్టర్ స్రవంతి, రావూరి లక్ష్మీ, వాణి వెంకట్ తదితర జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467